ఆత్మార్పణ

వసుంధర

ముసుగు తన్ని నిద్రపోతున్నాడు సతీష్. తల్లి అతణ్ణి పేరు పెట్టి లేపింది. లేవలేదు. ఒరేయ్ లేవరా అని అరిచింది. లేవలేదు.

"బారెడు పొద్దెక్కినా పిలిచి లేపాల్సిందే—ఇంకా చిన్న పిల్లాడిననుకుంటున్నావా?" అంటూ తిట్టింది.

సతీష్ లేవలేదు.

ఇక లాభంలేదని వంగి మనిషిని కుదిపింది.

సతీష్ కదలలేదు. మెదలలేదు.

"తాతయ్యకు జ్వరమొచ్చిందిరా - డాక్టర్ని పిల్చుకుని రావాలి—" అంది తల్లి ఆఖరి అస్త్రంగా.

సతీష్ చటుక్కున లేచి కూర్చుని — "ఆ మాట ముందే చెప్పవేం?" అన్నాడు.

"నీకు మెలకువ తెప్పించి అప్పుడు చెప్పాలనుకున్నాను—...." అంది తల్లి.

"ఏమయింది తాతయ్యకి? నిన్నటిదాకా బాగానే

వున్నాడుగా—" అన్నాడు సతీష్ కంగారుగా.

"ఏమో—వెళ్ళి నువ్వే అడుగు...." అంది తల్లి.

సతీష్ గబగబా అక్కణ్ణించి తాతయ్య గదికి వెళ్ళాడు. ఆయన అప్పుడే స్నానం చేసి దైవప్రార్థన చేసుకుంటున్నాడు.

"తాతయ్యా! నీకు జ్వరం వచ్చిందా?" అన్నాడు సతీష్.

ఆయన వెనక్కి తిరిగి—"ఏం? నిన్ను నిద్ర లేపడానికి మళ్ళీ మీ అమ్మ ఆ అబద్ధమే చెప్పిందా?" అన్నాడు.

"హమ్మయ్య! అమ్మ చెప్పింది అబద్ధమన్నమాట...." అంటూ సతీష్ తేలికగా నిట్టూర్చాడు.

"రోజూ మీ అమ్మ అబద్ధమే చెబుతుంది. అయినా అదెందుకు నమ్ముతావురా?" అన్నాడు తాతయ్య ముచ్చటగా మనుమడివంక చూస్తూ.

"ఏమో మరి—ఒకవేళ అమ్మ నిజం చెబితే—అప్పుడు నిజంగా నీకు మందులవసరపడతాయి. డాక్టర్ని పిలవడానికింట్లో నేను తప్ప ఎవరున్నారు? నీ విషయంలో నేను రిస్కు తీసుకోలేను తాతయ్యా!" అన్నాడు సతీష్.

సతీష్ తాతయ్య నారాయణరావు తృప్తితో కూడిన చిరునవ్వు నవ్వి—"ఇలా రా!" అన్నాడు.

సతీష్ ఆయన్ను సమీపించాడు.

"ఎందుకురా—నీకు నేనంటే అంత ప్రేమ?"

"ఏమో తాతయ్యా—నువ్వే చెప్పాలి!"

నారాయణరావు గంభీరంగా — "ఇకమీదట మీ అమ్మకు అబద్ధం చెప్పాల్సిన అవసరం కల్పించకు. లేప

గానే లేచిపో—" అన్నాడు.

"ఎందుకని?"

"పైన తథాస్తు దేవతలుంటారు. అసమానూ మా అమ్మ నాకు జ్వరం జ్వరం అంటూంటే ఒకరోజున నిజంగానే నాకు జ్వరం వచ్చేస్తుంది—"

"అమ్మ మాటలను తథాస్తు దేవతలు నిజం చేయాలంటే—ఈ ప్రపంచపురీతే మారిపోతుంది. నీకా భయం లేదులే తాతయ్యా!" అన్నాడు సతీష్.

"అయితే అమ్మచేత ఆ మాటనిపించిగానీ నిద్రలేవనన్నమాట!"

"ఏం చేయను తాతయ్యా? ఎందుకో నా కిటీవల విపరీతంగా నిద్రపడుతోంది. మత్తులో నిద్ర లేవలేక పోతున్నాను...."

"రాత్రిళ్ళు ఆలస్యంగా యింటికొస్తున్నావని మీ అమ్మంటోంది...."

సతీష్ మాట మార్చడంకోసం—"నువ్వు ఈ ముసలితనంలోకూడా రోజూ పొద్దున్నే స్నానం చేస్తావేం? నీ ఆరోగ్యం పాడవదూ?" అన్నాడు.

"స్నానం చేయకుండా దైవప్రార్థనెలా చేసుకోనూ?"

"దేవుణ్ని ప్రార్థించడానికి నీకింకా కోరికలేమున్నాయి?"

నారాయణరావు నవ్వి—"నీకుద్యోగం రావాలి. నువ్వు పెళ్ళిచేసుకుని వేరు కాపురం పెట్టాలి—...." అన్నాడు.

"ఏం తాతయ్యా? నే నీ యింట్లోంచి వెళ్ళిపోవాలని నీకు కోరికగా వుందా?"

"అప్పుడా—మీ నాన్న వ్యవహారం నాకు నచ్చడం లేదు. నువ్విప్పుడు వేరు కాపురం పెడతావా—నీతో వచ్చి వుందామా—అని చూస్తున్నాను....అందుకే ఈ చలిలోకూడా పొద్దున్నే లేచి స్నానంచేసి దైవప్రార్థన చేస్తున్నాము...." అన్నాడు నారాయణరావు.

"నాకుద్యోగం రావాలంటే ఆ దేవుడుకూడా సాయం పడలేడనుకుంటాను. ప్రపంచం తీరలావుంది—" అన్నాడు సతీష్.

నారాయణరావు నిట్టూర్చాడు.

2

నారాయణరావు కిద్దరే పిల్లలు. ఉద్యోగంలో వుండగానే ఆయన కూతురి పెళ్ళి చేశాడు. కొడుక్కుద్యోగం వేయించాడు. ఓ మంచిల్లుకూడా కట్టాడు.

ఇప్పుడాయనకు అరవై ఏళ్ళు. రిటైరైనాడు. ప్రతి నెలా అయిదువందల రూపాయలు పెన్షను వస్తుంది. ఆయన రిటైరైన ఏళ్ళనే కొడుక్కూ ఉద్యోగం రావడంవల్ల స్వంతింట్లో కొడుకు దగ్గర సుఖంగా వుంటున్నాడు. డబ్బుకు తమపై ఆధారపడని మామగారంటే కోడలికి గౌరవం

నారాయణరావు కొడుకు జగన్నాథం. కోడలు మాలతి. ఆ దంపతులకిద్దరే పిల్లలు. పెద్ద పిల్ల రేవతికి ఆరేళ్ళ క్రితమే పెళ్ళయింది. రెండోవాడు సతీష్ బియ్యే ప్యాసై రెండేళ్ళయింది.

సతీష్ అతికష్టంమీద బియ్యే ప్యాసయ్యాడు. ఇంక చదువుకోనని మొరాయించాడు. అతడికుద్యోగ మిప్పించాలని నారాయణరావు, జగన్నాథంకూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

బియ్యే ప్యాసవగానే ఓ కంపెనీలో ఉద్యోగమిప్పిస్తే సతీష్ అక్కడ బాస్‌తో దెబ్బలాడాడు. అతడి వుద్యోగం ఊడింది. ఆ తర్వాత వరో ఆర్నెల్లకు మరోచోట అదే జరిగింది. ఆ తర్వాతనుంచి జగన్నాథం కొడుకు గురించి బెంగ పెట్టుకున్నాడు.

సతీష్ మనస్తత్వానికి మామూలుద్యోగాలు సరిపోవు. అతడు అధికారుల జులుం అంగీకరించడు. అలాగని విశాల భావాలూ లేవు. తన క్రింది వాళ్ళపై అతడు జులుం చేస్తూనే వుంటాడు. ఎన్నోసార్లు అతడు కూలివాళ్ళతో, రిక్షావాళ్ళతో, బస్సు కండక్టర్లతో గొడవపడ్డాడు.

సతీష్ ఇంట్లో యెంతో గారాబంగా పెరిగాడు. అతడాడింది ఆట, పాడింది పాట — అతడి క్రమశిక్షణ గురించి ఇంటో అంతో పట్టించుకునేది తల్లి మాలతి మాత్రమే! నారాయణరావామెనందుకు మందలిస్తూండేవాడు.

"మితిమీరిన గారాబం చేస్తే కుర్రాడు చెడిపోతాడు మామయ్యా!" అనేది మాలతి ఆయనతో.

"మనవాడేం చెడిపోయాడని? క్లాసుల్లో ఫస్టు రాక పోయినా పరీక్షలు ప్యాసవుతూనే వున్నాడు గదా—" అనేవాడు నారాయణరావు.

సతీష్ పరీక్షలు ప్యాసవడమే ఆయనకు కొలబద్దగా వుండేది. ఇంట్లో వాళ్ళకు తెలిసి సతీష్‌కు దురలవాట్లు కూడా లేవు.

మామగారి మాటలకు మాలతి తృప్తిపడేది.

ఏభయ్యో యేట భార్య పోయింది నారాయణ రావుకు. అప్పట్నించీ ఆయన మనుమడే ప్రాణంగా జీవిస్తున్నాడు.

ఇచ్చి పుచ్చుకోవడాలు ప్రేమలోనూ వుంటాయి.

చిన్నప్పట్నించీ సతీష్‌కు తాతయ్య దగ్గర బాగా చేరిక. ఇంట్లోని అందరికీ ఆయనే తనకు ఆత్మీయుడన్న భావం అతడిలో యెప్పుడూ ఉండేది. బామ్మ పోయాక అతడికీ తాతయ్యే ప్రాణమయ్యాడు.

బియ్యే ప్యాసై రెండుసార్లుద్యోగం వదులుకున్నాక తల్లి అతణ్ని సాధించడం మొదలు పెట్టింది. నారాయణ రావామెను మందలిస్తూండేవాడు.

"మీరూ అలాగంటే ఎలా? ఇంట్లో వున్నట్లే ఆఫీసులో మసిలితే కుదరదని మీ రేవాడికి చెప్పాల్సిందిపోయి.... నన్ను మందలిస్తారేమిటి మామయ్యా!" అని మాలతి యెదురుతిరిగింది.

"నా మనుమడు—ఒకరి మోచేతి నీళ్ళు తాగేవాడు కాదు...." అని—"ఏరా — డబ్బిస్తాను .... ఫ్యాన్సీ దుకాణం పెట్టుకుంటావా?" అన్నాడు నారాయణరావు.

సతీష్ అంగీకరించాడు.

పదివేలు పెట్టుబడికి పాతిక వేలు బ్యాంకులోన్ తోడు కాగా ఫ్యాన్సీ దుకాణం వెలిసింది. అయితే సతీష్‌కి అదీ సరిపడలేదు. స్టేట్ గవర్నమెంట్ ఆఫీసర్లు, సేల్సుటాక్సు వాళ్ళు ఇన్‌కంటాక్సువాళ్ళు .... అతడి వెంటబడ్డారు. అందరితోను అతడు గొడవ పెట్టుకున్నాడు. షాపు మూసేయాల్సిన అగత్యం పట్టింది.

"నువ్వింక బాగుపడవు...." అంది మాలతి.

"ఈ దేశంలో స్వతంత్రంగా బ్రతకాలనుకుంటే దారిలేదు...." అన్నాడు సతీష్ నిర్లక్ష్యంగా.

నారాయణరావు మనుమడినేమీ అనలేదు. ఆయన నమ్మకస్తుడైన బంధువుల కుర్రాడికి ఫ్యాన్సీషాపు అప్ప

గించాడు.

ప్రస్తుతానికి షాపుమీద కొంత ఆదాయం అందుతోంది. షాపు నిలబడింది. కానీ సతీష్ సమస్య అలాగే వుండిపోయింది.

బంధువుల కుర్రాడి పేరు నరసింహమూర్తి. నారాయణరావుగారిని మూర్తి—అని పిలుస్తాడు.

మూర్తి తెలివైనవాడు. నారాయణరావుగారిని ఇంప్రెస్ చేయాలని ఆతడు సర్వ ప్రయత్నాలూ చేస్తున్నాడు. మూర్తి యేదో ఒకరోజున ఆ ఫ్యాన్సీషాపును స్వంతం చేసుకోగలడని నారాయణరావు అనుమానం.

ఈలోగా సతీష్ ఓ వ్యాపారస్తుడి కూతుర్ని ప్రేమించాడు. ఇద్దరూ జల్సాగా తిరిగేవారు. వ్యాపారస్తుడికిది తెలిసి స్వయంగా ఇంటికి వచ్చి నారాయణరావుతో నిష్ఠూరంగా మాట్లాడాడు.

నారాయణరావుకొక్క్షపం వచ్చి—"మీ అమ్మాయిని మీరదుపులో పెట్టుకోక మా వాడిని తప్పుపడతారేం?" అన్నాడు.

"మీ అబ్బాయిని మీ రదుపులో పెట్టుకోగలరా?" అన్నాడాయన.

"నాకా అవసరంలేదు—...." అన్నాడు నారాయణరావు.

"నాకూ ఆ అవసరంలేదు—" అన్నాడా వ్యాపారస్తుడు.

"అయితే నా దగ్గర కెందుకు వచ్చారు?"

వ్యాపారస్తుడు నవ్వి — "మీరంటే నాకు గౌరవముంది. అందుకే వచ్చాను—" అన్నాడు.

"మీ మాటలు నాకర్థంకావడంలేదు—...."

"మీ వాడిని మీరే అదుపులో పెట్టుకోవడం మంచిది. అది మీకు చేతకాకపోతే నేనే మీ వాణ్ణి అదుపులో పెట్టాల్సి వుంటుంది. అది మీ వాడికి క్షేమం కాదు...."

"అంటే?"

"ఇది హెచ్చరిక ...." అని వెళ్ళిపోయాడాయన.

ఆ రాత్రి నారాయణరావు మనుమడిని కూర్చోబెట్టి హితబోధ చేశాడు.

"దీప నన్ను ప్రేమిస్తోంది తాతయ్యా ..." అన్నాడు సతీష్.

"కానీ— నేనీ పెళ్ళికి ఒప్పుకోను...."

"ఈ పెళ్ళి జరక్కపోతే నేనింట్లోంచి వెళ్ళిపోతాను" అన్నాడు సతీష్.

"నన్ను విడిచి వుండగలవురా?" అన్నాడు నారాయణరావు.

"ఉండలేను ....ఇంట్లోంచి వెళ్ళిపోవడమంటే నన్ను నేను శిక్షించుకోవడమే...."

"అదేం కాదు... ఆ దీపకోసం—నన్ను కూడా కాదంటున్నావు...."

"నువ్వు నన్ను సరిగ్గా అర్థంచేసుకోలేదు తాతయ్యా!" అన్నాడు సతీష్— "దీపతో నా పెళ్ళికి అంగీకరించక పోతే— నేనింట్లోంచి వెళ్ళిపోతాను. అయితే దీపనూ కలుసుకోను. నువ్వొప్పుకుంటే నే మా పెళ్ళి జరుగుతుంది. నువ్వొప్పుకునేదాకా నేను దీపనూ కలుసుకోను, నిన్నూ చూడను...."

నారాయణరావు మనసు ఆర్ద్రమైంది.

"ఒకసారా అమ్మాయిని పిల్చుకునిరా. నేను మాట్లాడతాను...."

"థాంక్స్ తాతయ్యా!" అన్నాడు సతీష్.

ఆ తర్వాత వారంరోజులపాటు — ఈరోజు, రేపు అంటూ గడిపాడతడు. నారాయణరావు దీప నిజంగానే తనింటికి వస్తుందనుకున్నాడు కానీ అలా జరుగలేదు.

సరిగ్గా వారంరోజుల తర్వాత సతీష్ చావు దెబ్బలు తిని రోడ్డుమీద పడుంటే — ఎవరో తీసుకువెళ్ళి హాస్పిటల్లో జేర్పించారు. మాలతి లబోదిబోమంటూ హాస్పిటల్ కు వెళ్ళింది. నారాయణరావుకూడా హాస్పిటల్లో మనుమడిని చూసుకున్నాడు.

"ఏమిట్రా యిది!" అన్నాడు నారాయణరావు.

"ప్రేమ" అన్నాడు సతీష్.

నారాయణరావు భారంగా నిట్టూర్చాడు.

సతీష్ హాస్పిటల్లో పదిరోజులున్నాడు. హాస్పిటల్లోంచి బయటపడేసరికి — దీపకు పెళ్ళి జరిగి హనీమూన్ కు కాశ్మీర్ వెళ్ళింది.

నెలరోజుల తర్వాత ఆమె తిరిగి వచ్చింది.

సతీష్ వీలుచూసి ఆమెను కలుసుకున్నాడు. ఆమె అతడి నెరుగనుపొమ్మంది.

రెండ్రోజులపాటు సతీష్ పిచ్చివాడిలా తిరిగాడు.

"ఏమిట్రా యిది!" అన్నాడు నారాయణరావు.

"మోసం!" అన్నాడు సతీష్.

"మోసగాళ్ళను ప్రేమించకు. ఇలాగే భంగపడతావు...."

సతీష్ విషాదంగా నవ్వాడు. మానసికంగా అతడు దెబ్బతిన్నాడని గ్రహించి — నారాయణరావతణ్ని ఓదార్చాడు. సతీష్ కాయన దగ్గర చేరిక ఎక్కువయింది.

కానీ అప్పట్నించీ సతీష్ లో కొత్త మార్పు వచ్చింది.

అతడు రాత్రిళ్ళు ఆలస్యంగా ఇంటికి వస్తున్నాడు. ఉదయం ఓ పట్టాన నిద్ర లేవడం లేదు.

నారాయణరావు కుమారుని భవిష్యత్తు గురించి బెంగ పెట్టుకున్నాడు. రోజూ విధిగా దైవప్రార్థన చేస్తున్నాడు.

3

"సతీష్ ..సతీష్ ..."

"ఎవరో తలుపు తడుతున్నారు.

జగన్నాథం వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా కనబడిన యువకుణ్ణి చూసి—"నువ్వు....విశ్వం కదూ!" అన్నాడు.

"అవునండీ—సతీష్ ఇంట్లో వున్నాడా?" అన్నాడు విశ్వం.

"స్నానం చేస్తున్నాడు...." అన్నాడు జగన్నాథం.

విశ్వం అసహనంగా—"ఓసారి అర్జంటుగా రమ్మని పిలుస్తారా?" అన్నాడు.

జగన్నాథం అదోలా అతడి వంక చూసి-"కూర్చో!" అన్నాడు.

విశ్వం వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు. జగన్నాథం లోపలకు వెళ్ళాడు.

విశ్వం ఆయన వెళ్ళగానే మళ్ళీ లేచినిలబడ్డాడు. జేబుల్లో చేతులు పెట్టుకుని అటూ ఇటూ తిరిగాడు. క్షణమొక యుగంలా వుందతడికి.

కాసేపటిలో సతీష్ అక్కడికి వచ్చాడు.

విశ్వం సతీష్‌ని చూస్తూనే—"బయటకు వస్తావా?" అన్నాడు.

"ఎందుకు?"

"అర్జంటు పనుంది...."

"ఏమిటి?"

"బయటకు వచ్చేక చెబుతాను...."

"చెప్పందే రాను...."

"సుధాకర్ బామ్మ చచ్చిపోయింది...."

సతీష్ చిరాగ్గా—"సుధాకర్ ఎవరు?" అన్నాడు.

"సుధాకర్ తెలియదూ? అరుణా హోటల్ ప్రొప్రయిటర్ కొడుకు...."

"అతడా!" అని-"అతడి బామ్మపోతే నాకెందుకు?" అన్నాడు సతీష్.

"అతడి బామ్మది మామూలు చావు కాదు. ఎవరో హత్య చేశారు...."

సతీష్ ఉలిక్కిపడి—"అయితే?" అన్నాడు.

"నీతో చాలా మాట్లాడాలి. కానీ యిక్కడ కాదు."

సతీష్ మళ్ళీ— "నేను రాను...." అన్నాడు.

"అయితే ఇక్కడే నీకింకా వివరాలు చెప్పాలి...."

"చెప్పు...." అన్నాడు సతీష్ నిర్లక్ష్యంగా.

"సతీష్! సుధాకర్ బామ్మను చాకుతో పొడిచాడు హంతకుడు. హత్యాయుధాన్నామె శరీరంలోనే వదిలాడు. ఆ చాకు స్టెయిన్ లెస్ స్టీలుది. దానిమీద గులాబి పూవు బొమ్మవుంది. ఎస్ అన్న ఇంగ్లీషు పొడి అక్షరం వుంది...."

సతీష్ కంగారుగా—"పాంటు మార్చుకుని వస్తాను — పద!" అన్నాడు.

"ఇంకా నీతో చాలా మాట్లాడాలి. చాలా అర్జంటుగా మాట్లాడాలి. త్వరగా రావాలి మరి!" అన్నాడు

విశ్వం

"ఇక్కడున్నట్లు వచ్చేస్తాను..." అంటూ లోపలకు వెళ్ళాడు సతీష్. లోపల సతీష్‌కి తన పాంటు జేబులు వెదుకుతున్న తండ్రి కనిపించాడు.

"ఏం చేస్తున్నావు నాన్నా?" అన్నాడు సతీష్ ఆశ్చర్యంగా.

"ఇది నీ పాంటా? నా దనుకున్నాను...." అంటూ లోపలకు వెళ్ళాడు జగన్నాథం. తండ్రిని గురించి అట్టే పట్టించుకోకుండా బట్టలు మార్చుకున్నాడు సతీష్.

4

"నాన్నా!" అన్నాడు జగన్నాథం.

"ఏరా?" అన్నాడు నారాయణరావు.

"మన సతీష్ గురించి బెంగగా వుంది—" అన్నాడు జగన్నాథం.

"ఎందుకని?"

"పెన్సిలు చెక్కుకుందుకని నువ్వు సతీష్‌కి ఓ చాకు కొని పెట్టావు గుర్తుందా?" అన్నాడు జగన్నాథం.

"ఊఁ!"

"దానిమీద గులాబిపువ్వు బొమ్మ వుంటుంది. ఎస్ అన్న పొడి అక్షరం కూడా వుంటుంది..."

"అవును...." అని—"సతీష్ కదా చేతి యిచ్చిం. ఎవరికీ అదివ్వడు. అల్లం తినుగుతానంటే మా ఆవిడకు కూడా యివ్వడు...." అన్నాడు నారాయణ రావు.

"ఆ చాకిప్పు డింట్లో లేదు...."

"దాని సంగతి మన కెందుకు? వా డెక్కడో దాచుకుని వుంటాడు...." అన్నాడు నారాయణరావు.

"వాడి బీరువాలో ఎక్కడా లేదు...."

"జేబులో పెట్టుకున్నాడేమో!"

"వాడి పాంటు జేబులు చూశాను. కనపడ లేదు........"

నారాయణరావు ఆశ్చర్యంగా—"సీ కా చాకు కావాలంటే వాడినడిగి తీసుకోవచ్చును కదా—చాటుగా వెతకడ మెందుకూ?" అన్నాడు.

"ఎందుకంటే ఆ చాకిప్పుడో హత్యాయుధం...." అన్నాడు జగన్నాధం.

"ఏమిటీ?"

జగన్నాథ వెంటనే "ఇప్పుడే విశ్వమని ఓ కుర్రాడు వచ్చి మన సతీష్‌ని తీసుకుని వెళ్ళాడు. వాళ్ళ సంభాషణ నేను విన్నాను...." అంటూ తను విన్న విశేషం చెప్పాడు.

నారాయణరావు నెల్లబోయి—"అయితే యేం జరిగిందంటావ్?" అన్నాడు.

"ఏమో—నాకూ తెలియడంలేదు...." అన్నాడు జగన్నాధం.

కాసేపు తండ్రీ కొడుకుల మధ్య మౌనం రాజ్య మేలింది.

"మన సతీష్ హత్య చేయడు...." అన్నాడు జగన్నాథం.

"అసలు హత్య చేయాల్సిన అవసర మేముంది వాడికి?"

"అందులోనూ—ఎవరో సుధాకర్ బావ్మని...."

మళ్ళీ తండ్రి కొడుకుల మధ్య మౌనం రాజ్య మేలింది.

"అసలిదంతా నా కెందుకు చెప్పావు?" అన్నాడు నారాయణరావు.

"విశ్వం మాట్లాడిన తీరునుబట్టి—అతడు సతీష్‌ని అనుమానిస్తున్నట్లనిపించింది. అతడు మనవాడి నెందు కనుమానించాలి?" అన్నాడు జగన్నాథం.

"అది నీ అనుమానం. అతడు మనవాడి నెందు కనుమానిస్తాడు?"

"హత్యాయుధం మనవాడి చాకే ఎందుకవ్వాలి? అతడు వివరాలు చెప్పగానే—ఒక్క మాట కూడా అనకుండా విశ్వాన్ననుసరించి యెందుకు వెళ్ళాడు?"

"విశ్వం శవం దగ్గర మనవాడి చాకును చూసి వుంటాడు. వెంటనే ఆ విషయం చెప్పడాని కిక్కడికి వచ్చివుంటాడు...." అన్నాడు నారాయణరావు.

"కానీ యిదంతా యెందుకు జరిగింది? యెలా జరిగింది?...."

"ముందా సుధాకర్ బొమ్మ హత్య గురించి వివరాలు తెలుసుకోవాలి...." అన్నాడు నారాయణరావు సాలోచనగా.

"అనవసరంగా ఇలాంటి వ్యవహారంలో తలదూర్చడం నా కిష్టంలేదు. ఎందుకంటే—అది లేనిపోని అనుమానాలకు దారితీస్తుంది...."

"నిజమే.... కానీ మనవాడిప్పు డక్కడికే వెళ్ళాడేమో!"

"వెళ్ళి ఆ చాకు నాదే అన్నాడంటే పోలీసులు వాణ్ణి అరెస్టు చేస్తారు...."

"అలా జరగడానికి వీల్లేదు...." అన్నాడు నారాయణరావు వెంటనే.

"అలాగే జరుగుతుందని నాకు భయంగా వుంది. ఏం చేయాలో పాలుపోవడం లేదు. లోపాయికారీగా

కూడా అటువైపు వెళ్ళడం నా కిష్టంలేదు—" అన్నాడు జగన్నాథం.

"సరేలే—నేను బయటకు వెళ్ళి విషయం వాకబు చేస్తాను. నువ్వేమీ కంగారుపడకు—" అన్నాడు నారాయణరావు.

జగన్నాథం తేలికగా నిట్టూర్చి—"నువ్వు వేలు పెడితే యేపనైనా సానుకూలమవుతుంది నాన్నా!" అన్నాడు.

5

ఆమె పేరు పార్వతమ్మ. వయసు అరవైయేళ్ళు. మనిషి దృఢంగా వుంటుంది. ఆమెకు నాగేశ్వరరావు నటించిన సినిమాలంటే ప్రాణం. వీలు చూసుకుని, వీలు చేసుకుని తరచుగా సినిమాలు చూస్తూంటుంది. సాధారణంగా మ్యాట్నీకో, మొదటి ఆటకో వెడుతూంటుంది. అప్పుడప్పుడు రెండో ఆటకూ వెడుతూంటుంది.

ఆ ఊరామెకు కొట్టినపిండి. ఆ ఊళ్ళో దొంగతనాలు, దోపిడీలు అరుదు. అందుకని ఆమె ఒంటరిగానే సినిమాలు చూస్తుంది. ఏ షోకు వెళ్ళినా ఆమె గురించి ఎవ్వరూ బెంగ పెట్టుకోరు.

ఆ రోజు రాత్రి ఆమె పాత సినిమా "పెళ్ళి కానుక"కు రెండవ ఆటకు వెళ్ళి తిరిగిరాలేదు.

తెల్లవారుఝామున మూడు గంటలకు పార్వతమ్మ కోడలు భార్గవికి మెలకువ వచ్చి టైము చూసుకుని అత్తగారింకా రాలేదని గుర్తించి కంగారుగా భర్తను లేపింది. భార్గవి భర్త ప్రసాద్—కొడుకు సుధాకర్‌ని లేపాడు. తండ్రీ కొడుకులిద్దరూ కలసి వెతకడం ప్రారంభించారు.

ఆమె పెళ్ళికానుక సినిమాకు వెళ్ళినట్లు యింట్లో తెలుసు. అందుకని సరాసరి తండ్రీ కొడుకులూ థియేటర్ కు బయల్దేరారు.

దారిలో వారికి పార్వతమ్మ శవం కనబడింది.

పార్వతమ్మ చనిపోయిందని ప్రసాద్ అనుకోలేదు. ఆయన పరీక్షించి చూసి — "ఎవరో కత్తితో పొడిచారు —" అన్నాడు.

"కత్తి కాదు. చాకు —" అంటూ పక్కనే వున్న చాకును తీయబోయాడు సుధాకర్.

"అది నువ్వు ముట్టుకోకు — అమ్మను నేను లేవదీస్తాను —" అన్నాడు ప్రసాద్. ఆయన తల్లిని ముట్టుకునేసరికి ఒళ్ళు చల్లగా వుంది. అప్పుడు పరీక్షించగా శ్వాసలేదు. గుండె చప్పుడులేదు.

"నీ బామ్మ చచ్చిపోయిందిరా —" అన్నాడు ప్రసాద్ చటుక్కున.

"అంటే .... హత్య!...." అన్నాడు సుధాకర్ నిశ్చేష్టుడై.

అరవై యేళ్ళ తన బామ్మ ఆ విధంగా హత్య గావించబడుతుందని సుధాకర్ అనుకోలేదు.

ఒకరు శవం దగ్గరే వుండిపోగా — ఇంకొకరు పోలీసు స్టేషన్ కి వెళ్ళి ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చారు. శవాన్ని హత్యాయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు.

విచారణలో తేలిన ప్రకారం పార్వతమ్మ మెడలో ఒక గొలుసు, రెండు చేతులకూ నాలుగు గాజులు పోయాయి. దగ్గర కొంత డబ్బు కూడా వుండాలి. ఎంతో తెలియదు.

"మా బామ్మ నా పెళ్ళి చూడాలని తహతహ

లాడింది. తను పోయేలోగా నన్ను పెళ్ళి చేసుకోమని ప్రతిమలాడింది. నేను వినలేదు. తను మా కెప్పూ బ్రతుకుతుందని నమ్మాను. దుర్మార్గుడు—నా బావమ్మ ప్రాణం తీశాడు..." అంటూ యేడ్చాడు సుధాకర్.

ఆ దుర్మార్గు డెవరో అతడికి తెలియదు. కానీ ఆ చాకెవరిదో అతడికి తెలుసు. అయితే తన అనుమానాన్నతడు పోలీసుల ముందు బయట పెట్టలేదు. ముందుగా విశ్వానికి చెప్పాడు.

విశ్వం సతీష్‌కి చెప్పాడు.

నారాయణరావు కొంత కథను పత్రికావిలేఖరి ద్వారా తెలుసుకున్నాడు. చివరి భాగం మాత్రం ఆయన ఊహించాడు.

విశ్వం, సుధాకర్, సతీష్—ఈ ముగ్గురూ స్నేహితులు. సతీష్ ద్వారా ఈ పేర్లాయన తరచు వింటూంటాడు.

"ఆమె ముసలిది. ఆ సమయంలో రోడ్డు నిర్మానుష్యంగా ఉన్నట్లుంది. లేకుంటే అన్ని గంటలసేపు శవమక్కడ పడివుండదు. నేరస్థుడామె నగలు కాజేయాలంటే ఆమెను చంపాల్సిన అవసరముండదు. వాడెవరో చాలా క్రూరాత్ముడై వుండాలి—" అన్నాడు పత్రికా విలేఖరి.

ఈ విషయం కూడా కొడుక్కి చెప్పాడు నారాయణరావు.

జగన్నాథం అప్పుడు ఆఫీసులో వున్నాడు—

"నా కేమిటో చాలా భయంగా వుంది నాన్నా!...." అన్నాడు.

"కానీ నా మనసిప్పుడు తేలికపడింది. ఆ హత్య

సతీష్ చేయలేదని స్ఫురపడింది—" అన్నాడు నారాయణ రావు.

"ఎలా?"

"నిజానికది దొంగతనం. అందుకు హత్య అవసరం లేదు. హంతకుడి క్రూరత్వమే హత్యకు పురికొల్పింది. మన సతీష్ అంత క్రూరంగా ప్రవర్తించ లేడు—" అన్నాడు నారాయణరావు.

"దొంగతనం మాత్రం మనవాడికి అవసరమా?"

"లేదు. కానీ అనుమానించాల్సిన అగత్యం యేర్పడింది కదా!"

జగన్నాథం నిట్టూర్చి—"చాకు గురించి సుధాకర్ రిపోర్టిస్తాడేమో!" అన్నాడు.

"నువ్వు భయపడకు. శవం దగ్గరున్న చాకు మన సతీష్‌ది కాదు. వేరెవ్వరిదో—" అన్నాడు నారాయణ రావు.

"నీ కెలా తెలుసు?"

"సతీష్ చాకు—ఇంట్లోనే వుంది!"

"ఎక్కడ?"

"నా దగ్గర ...."

"మరి ఇదయం నాతో చెప్పలేదేం?"

"సతీష్ ఎందుకు భయపడ్డాడో తెలుసుకోవాలనిపించింది నాకు. ఆ విశ్వం వచ్చి హత్యాస్థలంలో ఫలానా చాకుందనగానే వాడెందుకు కంగారుగా వెంటబడి పోయాడూ—అని నా కనుమానం కలిగింది. అందు కారణం తెలుసుకోవాలని యింట్లోంచి బయల్దేరాను ....—"

జగన్నాథం ముఖంలో తృప్తి కనబడింది—

"నాన్నా! నా మనసిప్పుడు తేలిక పడింది....—"
అన్నాడు.

ఎందుకో నారాయణరావు మాత్రం భారంగా నిట్టూర్చాడు.

6

ఉదయం వెళ్ళినవాడు మధ్యాహ్నం రెండింటి కింటికి తిరిగొచ్చాడు సతీష్. అతను దిగులుగా వుండడం కని పెట్టిన మాలతి—"ఏమయిందిరా?" అంది.

"ఏమీ కాలేదులే—" అన్నాడు సతీష్ చిరాగ్గా.

మాలతి అతణ్ణింక పలకరించడం మంచిది కాదని—భోజనానికి రమ్మంది.

"నేను భోంచేసే వచ్చాను—...." అన్నాడు సతీష్.

"ఎక్కడ?"

"ఓ స్నేహితు డింట్లో—...."

అతడి సమాధానం మాలతికి తృప్తి కలిగించలేదు. ఆమె మరి మాట్లాడకుండా మామగారి గదికి వెళ్ళింది.

నారాయణరావు మంచి నిద్రలో వున్నాడు. ఆయన్ని లేపింది.

"ఏమిటమ్మా?" అన్నాడు నారాయణరావు.

"సతీష్ వచ్చాడు. చిరాగ్గా వున్నాడు. భోంచేయమంటే యెక్కడో చేసే వచ్చానంటున్నాడు....—" అంది మాలతి.

ఆమె కళ్ళలోని దిగులు, హృదయవేదన వెంటనే నారాయణరావు కర్థమయ్యాయి—"నేను రమ్మన్నానని వాడి నొక్కసారిలా పంపించు—" అన్నాడాయన.

మాలతి వెళ్ళిపోయింది. కాసేపట్లోనే సతీష్ అక్క

దకు వచ్చి—"తాతయ్యా! అమ్మ నిన్ను రికమెండ్ చేయమందా?" అన్నాడు.

"దేనికి?"

"భోం చెయ్యమని నాకు చెప్పడానికి...."

"నువ్వు భోంచేయకపోతే మీ అమ్మకేం నష్టం?" అన్నాడు నారాయణరావు.

"నష్టం కాకపోతే నీ కెందుకు చెప్పింది?" అన్నాడు సతీష్

"చెబితే మాత్రం నిన్ను పిలవాల్సిన అవసరం నాకే ముంది?"

"మరైతే నువ్వెందుకు పిలిచావు?"

"ఆలోచించి చూడు..."

"నా భోజనం గురించి అమ్మకూ నీకూ ఇంత పట్టిం పెందుకో—ఎంత ఆలోచించినా నా కర్థం కావడం లేదు—...." అన్నాడు సతీష్.

"అభిమానం విలువ పోగొట్టుకున్నప్పుడు కానీ తెలి యదులే...."

సతీష్ తడబడి—"అభిమానం నే నెప్పుడూ పోగొట్టు కోను...." అన్నాడు.

"ఇప్పటికే నా అభిమానం పోగొట్టుకున్నావు—" అన్నాడు నారాయణరావు.

"అర్థంకాదు తాతయ్యా!" అన్నాడు సతీష్.

"అనాదరం చేత అభిమానం ఆగదు. మీ అమ్మొచ్చి భోంచెయ్యనంటున్నావని చెప్పింది. ఆ వెంటనే నిన్ను పిలిచాను. కానీ భోంచేయమని చెప్పడానికి కాదు...."

సతీష్ ప్యాంటు జేబులోకి చేతులు పోనిచ్చి అటూ యిటూ నడుస్తూ—"మరెందుకు పిలిపించావు?" అన్నాడు.

"నాకోసారి నీ చాకు కావాలి...."

"ఏ చాకు?"

"నీ దగ్గరెన్ని చాకులున్నాయి?"

సతీష్ పక్క చూపులు చూశాడు. పక్కనే నారాయణరావు పూజామందిర ముంది. మందిరానికి పైన ఆంజనేయుడి పటం గోడకు వ్రేలాడుతోంది.

ఆంజనేయుడు తన్నురిమి చూసినట్లనిపించింది సతీష్‌కి.

"ఒకసారి నాకు చాకు కావాలి...."

"ఎందుకు?"

"చాకుతో యేం చేస్తారు?"

సతీష్ మళ్ళీ పక్క చూపులు చూశాడు. ఆంజనేయుడు పటంలోంచీ మళ్ళీ అతడి వంక వురిమి చూశాడు.

"పెన్సిలు చెక్కుకుంటారు—" అన్నాడు సతీష్.

"నేను పెన్సిలు చెక్కుకోవాలి...." అన్నాడు నారాయణరావు.

"పెన్సిలు నా కియ్యి. చెక్కి యిస్తాను...."

"నా ఆరోగ్యం బాగున్నంత కాలం నా పను లింకొకళ్ళకి చెప్పను....చాకు నాకు తెచ్చియ్యి...." అన్నాడు నారాయణరావు.

"నా ఆరోగ్యం బాగున్నంత కాలం నీ పనులు నిన్ను చేసుకోనివ్వను. నేనే చేసిపెడతాను—...." అన్నాడు సతీష్.

"సరేలే — ఒక్కసారి నా కా చాకు తెచ్చి చూపించు...."

"ఎందుకు?"

నారాయణరావు తన బట్టతలమీద కుడిచేయి ఆన్చి

ఓసారి పాముకున్నాడు. తర్వాత నెమ్మదిగా— "నేను నీకు అభిమానంతో కానిచ్చిన వస్తువది. దాన్నెంత భద్రంగా దాచుకుంటున్నావో చూద్దామని...." అన్నాడు.

మళ్ళీ సతీష్ పక్క చూపులు చూశాడు.

ఆంజనేయుడి బొమ్మ ఆతడి వంక గేలి చేస్తూ చూస్తోంది.

సతీష్ పూర్తిగా ఆ బొమ్మవైపు తిరిగాడు.

అతడి కయిదేళ్ళ వయసప్పుడు నారాయణరావా బొమ్మను చూపించి — "స్వామిభక్తికి ఆంజనేయుణ్ణి మించినవాడు లేడు. అందుకే ఆయన ఆరాధ్య దైవమయ్యాడు. భక్తితో ఆయన తాను నమ్మిన దేవుణ్ణి మించిన బలవంతుడయ్యాడు. సముద్రాలను దాటి, రాక్షసులను చంపి మహారాక్షసులను చంపిన శ్రీరామచంద్రుణ్ణి కూడా యుద్ధంలో ఓడించిన ఆంజనేయుడి విజయ రహస్యం స్వామిభక్తి. నీవు కూడా నీ యింట్లోవాళ్ళను ఆంజనేయుడంత భక్తితో ఆరాధించు. నువ్వూ ఆంజనేయుడంతవాడి వౌతావు—" అని చెప్పాడు.

ఆంజనేయుడి శక్తి గురించీ, బలపరాక్రమాల గురించీ నారాయణరావు చెప్పగా యెన్నో కథలు విన్నాడు సతీష్. ఆ దేవుడి వ్యక్తిత్వం అతడి మనసుపై చెరగని ముద్ర వేసుకుంది. తనూ అంతటివాడు కావాలన్న కోరిక గుండెల్లో చేరుకుంది. నారాయణరావును సతీష్ ఆరాధించేవాడు. తాతయ్యకు సేవలు చేసినపుడల్లా అతడా పటంవైపు చూసేవాడు. ఆంజనేయుడు తన వాశీర్వదిస్తూన్నట్లూ, శభాషని మెచ్చుకుంటున్నట్లూ అతడికి తోచేది.

ఈ రోజలాగనిపించడంలేదు.

"మళ్ళీ యెప్పుడూ తప్పు చేయను స్వామీ!" అను
కున్నాడు సతీష్.

"ఏరా చాకు తెచ్చిపెట్టవా?"

సతీష్ మాట్లాడలేదు.

"ఎలా తెస్తావులే— .... పారేసుకున్న వస్తువు మళ్ళీ
దొరుకుతుందా?"

"నేను చాకు పారేసుకున్నానని నీ కెవరు
చెప్పారు ....?"

"ఒకరు చెప్పాలా? నాకు దొరికింది కాబట్టి చెప్ప
గలిగాను ...."

"నీకు దొరికిందా— ఎక్కడ?" ఆత్రుతగా అడిగాడు
సతీష్.

"మన దొడ్లో— ...."

"అబద్ధం!" అన్నాడు సతీష్.

"ఇలా రా!" అన్నాడు నారాయణరావు.

సతీష్ నమ్మకలేని చూపులతో ఆయన వంక చూస్తూ
ఆయన్ను సమీపించాడు.

"ఈ తలగడ ఎత్తి చూడు!"

నారాయణరావు పట్టెడ మంచంమీద కూర్చుని
వున్నాడు. మంచంమీద పువ్వుల దుప్పటి. తలాగ్ర
దిక్కున ఓ ఫోమ్ తలగడ .... దానికి దుప్పటితో
మ్యాచయ్యే గలీబు ....

సతీష్ తలగడ ఎత్తి చూసి ఒక్కడుగు వెనక్కి
వేశాడు.

అక్కడ నిజంగా నే చాకుంది.

"ఏమిట్రా — అంతలా ఆశ్చర్యపడ్డావు ....? అది

నీ దవునో కాదో చూసుకో— ....” అన్నాడు నారాయణరావు.

సతీష్ చాకును చేతిలోకి తీసుకున్నాడు.

స్టెయిన్ లెస్ స్టీలు చాకు. గులాబిరంగు బొమ్మ. ఎస్ అన్న పొడి అక్షరం....

“ఇది నాదే.... కానీ నీ దగ్గర కెలా వచ్చింది?”

“నువ్వు పారేసుకుంటే....”

“నీ కెక్కడ దొరికిందన్నావూ?”

“మన దొడ్లో ...”

సతీష్ ఉత్సాహంగా—“అంటే సుధాకర్ బొమ్మను నేను చంపలేదు....” అన్నాడు.

“ఏమన్నావూ?” అన్నాడు నారాయణరావు.

సతీష్ తడబడ్డాడు.

“సుధాకర్ బొమ్మెవరురా?”

సతీష్ మాట్లాడలేదు.

“చంపడ మేమిటిరా?”

సతీష్ మౌనం కొనసాగించాడు.

“నువ్వెవరినైనా చంపిందీ లేనిదీ నీకు తెలియదా? నా దగ్గర చాకు చూసి గానీ ఆ విషయం తెలుసుకోలేవా?”

సతీష్ నాలుకతో పెదాలు తడుముకున్నాడు—“అసలేం జరిగిందీ చెబుతాను తాతయ్యా!”

“చెప్పు!”

అతడు క్లుప్తంగా సుధాకర్ బొమ్మ చావు గురించి చెప్పి—“అక్కడ యిలాంటి చాకే వుంది. సుధాకర్ నన్నుమానిస్తున్నాడు. నేనేమో ఆ చాకు నాది కాదనీ నా చాకు మాయింట్లో నే వుందనీ దబాయించాను....”

అన్నాడు.

"హత్య గురించి నిన్ననుమానించడ మేమిటీ? నువ్వేమి కిరాయి గూండావు కాదు గదా...." అన్నాడు నారాయణరావు.

సతీష్ మళ్ళీ తడబడ్డాడు.

"సుధాకర్ బావ్మును నువ్వెందుకు చంపుతావు?"

"ఏమో—సుధాకర్ కి వాళ్ళ బామ్మంటే చాలా యిష్టం. చాకు చూడగానే నన్ననుమానించాడు...."

"అలాంటి వాళ్ళతో స్నేహం చేయకు ...."

"అబ్బే—అదంతా తాత్కాలికావేశం తాతయ్యా! నా స్నేహితుడు విశ్వం అంటాడూ-సుధాకర్ కి ఎలాగైనా ఆ హంతకుణ్ణి పట్టుకోవాలనుందిట. నామీద అభియోగం చేసే నేనేమో పౌరుషం తెచ్చుకుని అసలు హంతకుణ్ణి పట్టుకుంటానని అలాగంటున్నాట్ట...."

"నువ్వు నిజం చెప్పడంలేదు. నా దగ్గరేదో దాస్తున్నావు...."

"లేదు తాతయ్యా!"

"అయితే ఆంజనేయుడి ముందుకు వెళ్ళి కళ్ళు మూసుకుని చేతులు జోడించి—నిజమేమిటో చెప్పేసేయ్.... నేను నమ్ముతాను...." అన్నాడు నారాయణరావు.

"లేకపోతే నమ్మవా?"

"నమ్మను ...."

"అసలు నీకు నామీద అనుమాన మెందుకొచ్చింది?"

"ఎందుకంటే....నీ చాకు శవం దగ్గరుంది. అది నీది కాదనీ ఇంట్లో నీ చాకుందనీ చెబితే నీ స్నేహితుడు నమ్మి ఊరుకున్నాడా?"

"లేదు....కాసేపట్లో వాళ్ళు మనింటికొస్తారు. నేను

చాకు చూపించలేకపోతే సుధాకర్ నామీద పోలీసు రిపోర్టిస్తానన్నాడు...."

"నువ్వేమన్నావు?"

"ఆ చాకు తాతయ్య దగ్గరుందన్నాను.... అంతే!"

"ఇప్పుడు సుధాకర్ వస్తాడా?"

"అవును.... విశ్వంతో కలిసి...."

"ఒకవేళ చాకు నా దగ్గరలేదనుకో .... సుధాకర్ నీమీద పోలీసు రిపోర్టిచ్చాడనుకో—పోలీసులు విచారణ ప్రారంభించారనుకో...."

"ఊఁ."

"నీకెలా వుంటుంది?"

"నాకేం భయంలేదు. నేను హత్య చేయలేదుగా...."

"చేశావని పోలీసులంటారు...."

"అందుకు ఋజువుండదు...."

"నీ చాకు...."

"నా చాకింట్లోనే వుంది...."

"అదృష్టకొద్దీ అది నాకు దొరికింది. అది వేరే విషయం. చాకు నాకు దొరకలేదనుకో ...అప్పుడు...."

"ఇంతకీ నువ్వు చెప్పదల్చుకున్నదేమిటి తాతయ్యా?"

"హత్య జరిగిన సమయంలో నువ్వెక్కడున్నావు?"

"ఎక్కడుంటే మాత్రం—హత్యాస్థలంలో వున్నట్లు ఋజువు లేదుకదా...."

"నీ చాకు హత్యాస్థలంలో వుంది...."

"అయితే?"

"అప్పుడు నువ్వింట్లో లేవు...."

"అయితే?"

"నువ్వింటికెప్పుడొచ్చావో—ఎదురింటి రామారావుకి తెలుసు అతడా సమయంలో పరీక్షలకని చదువుకుంటు న్నాడు...."

"ఇప్పుడివన్నీ యెందుకు తాతయ్యా? చాకిట్లో వుంది గదా!"

"హత్య జరిగిన సమయంలో నువ్వెక్కడున్నావో నాకు చెప్పు...."

"ఎందుకు?"

"నా తృప్తికోసం...."

"అంటే?"

"నా మనుమడు హంతకుడు కాదన్న తృప్తి నాక్కావాలి...."

"ఎందుకని? చాకిట్లోనే ఉందికదా....ఆ రుజువు చాలదా నీకు?"

"చాలదు...."

"ఎందుకు చాలదు?"

"అది నీ చాకు కాదు కాబట్టి!"

"అంటే?" అన్నాడు సతీష్ తెల్లబోయి.

"హత్యాస్థలంలో ఉన్న చాకు నీదే! అక్కడికెలా వెళ్ళిందో నువ్వు నాకు చెప్పాలి...." అన్నాడు నారాయణరావు.

"ఆ చాకు నాది కాదు...." అన్నాడు సతీష్.

"అయితే నీ చాకెక్కడుందో చెప్పు!"

"ఇదిగో—నా చాతిలో ఉంది...."

"ఇదీ నీది కాదు...." అన్నాడు నారాయణరావు.

"నాదికాక మరెవ్వరిది?"

"నాది...." అన్నాడు నారాయణరావు.

"చాకుమీద నా పేరుంది...."

"సరేలే—చాకులు కొన్నవాణ్ని నేను. కొనేటప్పుడే రెండు కొన్నాను. రెండింటిమీదా పేర్లు వేయించాను. ఒకదానిమీద ఎస్, మరోదానిమీద ఎన్. అయితే షాపువాడు పేర్లు సరిగా వేయలేదు. ఇంటికొచ్చేక చూశాను. రెండూ ఎస్. అనే ఉన్నాయి. ఒకటి నీకిచ్చాను. రెండోది నా దగ్గరుంచుకున్నాను...."

"నీకు చాకెందుకు?"

నారాయణరావు నవ్వి — "ఎందుకో ఒకందుకు? అప్పుడు నేను రెండు కొనడం ఇప్పుడు నీకు పనికొచ్చింది గదా! సుధాకర్ ఈ చాకు చూడగానే నీ మాటలు నమ్ముతాడు...." అన్నాడు.

"అవును తాతయ్యా....నీకు చాలా చాలా థాంక్స్!"

"అయితే నీ చాకెలా పోయిందో చెప్పు...."

"దాని గురించి నీకంత పట్టుదలెందుకు? నిజం చెబుతున్నాను తాతయ్యా— నేనే హత్య చేయలేదు...."

"నువ్వు హత్యచేసినా చేయకపోయినా నీ చాకెలా పోయిందో నాకు తెలియాలి. ఎందుకంటే—ఎవరో నీ చాకును తీసుకెళ్ళి హత్యాస్థలంలో పడేశారు—లేదా హత్యకు వాడుకున్నారు. అంటే వాళ్ళకు నీమీద కక్షవుంది. పగ సాధిస్తున్నారు. నీ శత్రువులెవరో నేను తెలుసుకోవాలంటే నాకు నీ చాకెలా పోయిందీ తెలియాలి...." అన్నాడు నారాయణరావు గంభీరంగా.

"తాతయ్యా! నాకు శత్రువు లెవ్వరూ లేరు. చెప్పాలంటే నాకు నేనే శత్రువుని...." అన్నాడు సతీష్.

"అంటే?" అన్నాడు నారాయణరావు ఆశ్చర్యంగా.

"సుధాకర్‌కి చూపించడానికి చాకు దొరికింది,

నాకివ్వాళెక్కడలేని ఆకలి పుట్టుకొస్తోంది. వెళ్ళి భోం చేస్తాను...." అన్నాడు సతీష్.

మనుమడు మాట మారుస్తున్నాడని అర్థమై-"సరేలే- వెళ్ళు కడుపునిండా భోంచేయి. ఈసారి చాకు జాగ్రత్తగా దాచుకో—" అన్నాడు నారాయణరావు.

సతీష్ చటుక్కున చాకును నారాయణరావు మంచం మీద పెట్టి—"తాతయ్యా! ఇది నీ దగ్గరే ఉండనీ— సుధాకర్ కి నీ దగ్గరే కదా చూపిస్తానని చెప్పాను—" అన్నాడు.

నారాయణరావు చాకును నెమ్మదిగా తలగడ క్రిందకు తోశాడు. సతీష్ తల్లి దగ్గరకు వెళ్ళి భోజనం పెట్టమని అడిగాడు.

"ఏ సమస్యనైనా మామయ్యట్టే పరిష్కరిస్తారు.." అనుకుంది మాలతి సంతృప్తిగా.

7

జగన్నాధం ఇంటికి వస్తూనే తండ్రి గదిలోకి వెళ్ళాడు. నారాయణరావతడికి జరిగినదంతా చెప్పి—"సుధాకర్ వచ్చి వెళ్ళాడు. మనవాడి ననుమానించినందుకతడు బాధ పడ్డాడు—" అన్నాడు.

"నువ్వు అద్భుత వ్యక్తివి నాన్నా!" అన్నాడు జగన్నాధం.

"నేను అద్భుత వ్యక్తిని కావచ్చు కానీ అ స్తమానూ అద్భుతాలు చేయలేను. నేను నిన్ను పెంచినట్లుగా నువ్వు సతీష్ని పెంచడంలేదని నాకిప్పుడనిపిస్తోంది-" అన్నాడు నారాయణరావు సీరియస్ గా.

"అదేమిటి నాన్నా!" అన్నాడు జగన్నాధం కంగారుగా.

"చిన్నప్పట్నించీ నేను నిన్నెంతో గారాబంగా పెంచాను. నువ్వు కోరినవన్నీ శక్తికొద్దీ నెరవేర్చడానికి ప్రయత్నించాను. నీ సంతోషమే నా సంతోషంగా జీవించాను. అయితే నిన్ను క్రమశిక్షణకు దూరంకానివ్వలేదు. నీకెంతో స్వేచ్ఛనిచ్చాను కానీ నిన్ను నా అదుపులోంచి పోనివ్వలేదు—...." అన్నాడు నారాయణరావు.

"అవును నాన్నా—పిల్లల పెంపకంలో యెవరైనా నీ తర్వాతనే...."

"మాటలు చెప్పడంవరకే తప్ప నానుంచి నువ్వేమీ నేర్చుకున్నట్లు లేదు. మన సతీష్ అదుపు తప్పాడని నా కనిపిస్తోంది—" అన్నాడు నారాయణరావు.

"నాన్నా! చిన్నప్పట్నించీ సతీష్‌ని నీ సంరక్షణలో వదిలాను. నన్నదుపు చేసినట్లే నువ్వు వాడిని అదుపు చేయగలవని భావిస్తున్నాను...." అన్నాడు జగన్నాధం.

నారాయణరావదోలా నవ్వి — "ఈ విషయంలో నువ్వు చాలా పొరబడ్డావు. నువ్వు నా సంతానానివి. నిన్ను పైకి తీసుకురావడం నా బాధ్యత. అందుకే యెప్పటికప్పుడు నిన్నదుపు చేస్తూ నీ ప్రగతిని రక్షించేవాణ్ని. నీకు వివాహమైనాక నా బాధ్యత ముగిసిందనుకున్నాను. సతీష్‌ని బాధ్యతగా నేనెప్పుడూ భావించలేదు. నాకు సంబంధించినంతవరకూ వాడొక ఆటబొమ్మ. మాట్లాడి మురిపించే జీవమున్న ఆటబొమ్మ. వాడితో నేను నా సరదాలు తీర్చుకునేవాణ్ణి. వాడినొక బాధ్యతగా నేనెప్పుడూ భావించలేదు. వాడి ప్రగతి గురించి నువ్వూ, కోడలూ ఆలోచిస్తారని నమ్మాను. కానీ అలా జరిగినట్లు లేదు...." అన్నాడు.

"అలా యెందుకనుకుంటున్నావు?" అన్నాడు జగ

న్నాథం.

"మనవాడికి చదువొకమాదిరిగా వచ్చింది. సరేలే అనుకున్నాను. ఆ తర్వాత ఒక్క ఉద్యోగం తిన్నగా చేయలేదు. దానికీ సరిపెట్టుకున్నాం. గొప్పవాళ్ళ పిల్లను ప్రేమించానని చావుదెబ్బలు తిని తర్వాత మోసపోయానని గ్రహించాడు. ఇప్పుడేమో — రాత్రిళ్ళెక్కడెక్కడో తిరుగుతున్నాడు. వాడి చావు ఓ హత్యాస్థలంలో ఉంది—" అన్నాడు నారాయణరావు.

"ఇదంతా యేమిటి?" అన్నాడు జగన్నాథం.

"ఏమిటో నువ్వే చెప్పాలి. కుర్రాడు నీ అదుపులో లేడనిపిస్తోంది...."

"ఇప్పుడు నేనేం చేయాలి?"

"సతీష్‌ని నీ అదుపులోకి తెచ్చుకో...."

జగన్నాథం దీనంగా నారాయణరావు వంక చూసి "నాన్నా! వాడి విషయంలో నీకేమైనా అనుమానముంటే-అది నువ్వే తెల్సుకో. నీ అదుపులోకి తెచ్చుకో. అప్పుడు నాకప్పగించి ఏం చేయాలో చెప్పు. నాకేమీ తెలియదు—" అన్నాడు.

నారాయణరావు నిట్టూర్చి—"అన్నింటికీ నామీద ఆధారపడితే — యెల్లకాలమూ నేనుండను గదా—" అన్నాడు.

"ఏమో నాన్నా—నువ్వు చెబుతూంటే నాకేదో భయంగా ఉంది. అర్జంటుగా వాణ్ని నీ అదుపులోకి తెచ్చుకో—...." అన్నాడు జగన్నాథం.

"రాత్రిళ్ళు వాడెక్కడికి వెడుతున్నాడో — ఏం చేస్తున్నాడో—అదికూడా నీకు తెలియదా—తెలుసుకోలేవా?" అన్నాడు నారాయణరావు.

జగన్నాథం తల అడ్డంగా ఊపి—"అడిగితే తిన్నగా యేదీ చెప్పాడు వాడు—" అన్నాడు.

8

రాత్రి పదయింది.

"అమ్మా! తలు పేసుకో — నేను మళ్ళీ తెల్లవారు ఝామున వస్తాను...." అన్నాడు సతీష్.

"ఎక్కడికిరా?" అంది మాలతి.

"ఎక్కడికో అక్కడికి — నీకెందుకు?" అన్నాడు సతీష్ నిర్లక్ష్యంగా ముందుకు వెడుతూ.

"ఎక్కడికిరా?

సతీష్ ముందడుగు వేయబోయినవాడే చటుక్కున మళ్ళీ వెనక్కి తిరిగాడు.

ప్రశ్న వేసిన ఆ గొంతు అతడి తాతయ్యది.

"స్నేహితుడింటికి—...."

"ఎవరా స్నేహితుడు?"

"నీకు తెలియదత దేవరో" అన్నాడు సతీష్.

"నాకు తెలియని వాళ్ళింటికి నువ్వు వెళ్ళడానికి లేదు....'

"ఎందుకని?"

"రాత్రిళ్ళు నిన్ను బయటకు పంపను ..."

"ఎందుకు?" రెట్టించాడు సతీష్.

"ఒకసారి చావు పారేసుకుని వచ్చావు. మళ్ళీ ఇంకేం పారేసుకుంటావోనని నా భయం...."

"పారేసుకుందుకు నా దగ్గరింకేమీ లేవు...."

"నీ గురించి నీకంటే నాకు బాగా తెలుసు. నువ్వెక్కడికీ వెళ్ళడానికి వీల్లేదు. పద — లోపలకు...." నారాయణరావు గంభీరంగా అన్నాడు.

"తాతయ్యా—ప్లీజ్ ....నన్ను వెళ్ళనీ...."

కాసేపు తాతామనుమళ్ళ మధ్య వాగ్వివాదం జరిగింది.

మాలతి ఇదంతా కుతూహలంగా చూస్తోంది.

ఇద్దరూ యెవరిపట్టు వారు వదలడంలేదు. మాలతికి తల్లి మనసుపీకి—"పోనీ—వాడిని వెళ్ళనిస్తే నేం?" అనుకుంది కానీ పైకి అనలేదు.

నారాయణరావు చివరికి విసుగ్గా—"ఒక షరతుమీద నిన్ను బయటకు వెళ్ళనిస్తాను...." అన్నాడు.

"చెప్పు— ...."

"నేనూ నీతో వస్తాను...."

"కుదరదు...."

"అయితే నువ్వు బయటకు వెళ్ళడం కుదరదు...."

ఇద్దరిమధ్యా మళ్ళీ వాగ్వివాదం. చివరికి నారాయణరావే జయించాడు. ఎందుకంటే ఆయన మనుమడితో వచ్చి తీరుతానని పంతం పట్టాడు.

అసహనంగా, అయిష్టంగా సతీష్ ఇంట్లో ఉండడానికి అంగీకరించాడు. నారాయణరావు తృప్తిగా నిట్టూర్చాడు.

9

ఒక రాత్రివేళ సతీష్ లేచాడు. టైమప్పుడు పన్నెండు కావస్తోంది.

అసహనంగా అతడు నారాయణరావువంక చూశాడు.

నారాయణరావు వళ్ళు తెలియని నిద్రలో ఉన్నాడు. గుర్రుకూడా పెడుతున్నాడు.

గదిలో నైట్ బల్బు వెలుగుతోంది.

సతీష్ గదిలోంచి బయటకు వెళ్ళపోయాడు. అప్రయత్నంగా అంజనేయుడి బొమ్మ అతడివంక క్రూరంగా

చూసింది.

సతీష్ ఆగిపోయాడు.

నారాయణరావింకా గుర్రుపెడుతూనే ఉన్నాడు.

సతీష్ పటానికి సమస్కరించి—"ఆంజనేయా! నన్ను మన్నించు—" అంటూ గదిలోంచి బయటకు వచ్చాడు.

గది బయటకు కూడా నారాయణరావు గుర్రు వినపడుతూనే ఉంది.

సతీష్ తేలికగా నిట్టూర్చి ముందడుగు వేశాడు. అయితే వీధి గుమ్మానికి అడ్డంగా ఓ మడత మంచం దానిమీద—మాలతి పడుకుని ఉంది.

"ఓహో—నన్నాపడానికి గట్టి ప్రయత్నమే జరుగుతోందన్నమాట...." అనుకున్నాడు సతీష్. అతడు దొడ్డిదారిన బయటకు వెళ్ళాలనుకున్నాడు. కానీ బయటకు వెళ్ళడానికుపయోగించే ఇతర ద్వారాలు రెండూ మూసి, తాళం పెట్టబడి ఉన్నాయి. బయటకు వెళ్ళాలంటే ఇక వీధి గుమ్మం ఒక్కటే మిగిలింది.

సతీష్ తటపటాయించలేదు. తల్లి దగ్గరకు వెళ్ళాడు. తట్టిలేపాడు. మాలతి కళ్ళు నలుముకుంటూ లేచి—"ఏమిట్రా!" అంది.

"నేను వెళ్ళాలమ్మా!" అన్నాడు సతీష్.

"ఎక్కడికి?"

"హుష్—గట్టిగా అరవకు తాతయ్య లేస్తాడు...."

"ఎక్కడికో చెప్పు...." అంది మాలతి స్వరం తగ్గించి.

"అమ్మా! నా స్నేహితుల్లో పరువుపోతుంది. వచ్చేక అన్నీ చెబుతాను. నేను కాని పనేమీ చేయడంలేదు. నన్ను వెళ్ళనీయి—" అన్నాడు సతీష్.

"తాతయ్య నిన్నెక్కడికీ వెళ్ళనివ్వద్దన్నారు...."

"అమ్మా-ఈ ఒక్క రోజుకీ ...ప్లీజ్...." అన్నాడు సతీష్.

మాలతి ఒప్పుకోలేదు.

సతీష్ వెంటనే తల్లి కాళ్ళు పట్టుకుని — "నేను నీ కాళ్ళు వదలను-నన్ను వెళ్ళనిచ్చేదాకా—" అన్నాడు.

మాలతి కాస్త చలించింది. అయినా మేకపోతు గాంభీర్యం వహించింది.

ఈలోగా ఆమె పాదాలు తడిశాయి.

సతీష్ యేడ్వడం ప్రారంభించాడు. కన్నీటితో ఆమెకు పాదాభిషేకం చేస్తున్నాడు.

మాలతి ఇక ఆగలేకపోయింది— "సరే వెళ్ళు మళ్ళీ తాతయ్య లేచేలోగా వెనక్కు వచ్చేయి. గుర్తుంచుకో-ఈ ఒక్క రోజుకు మాత్రమే నిన్ను వెళ్ళనిస్తున్నాను" అన్నదామె.

సతీష్ బయటకు వెళ్ళాడు.

అతడిలా వెళ్ళాడో లేదో-"ఇదన్నమాట-నీ అదుపు" అన్నమాట వినిపించింది. మాలతి ఉలిక్కిపడి వెనక్కు తిరిగింది.

నారాయణరావు, జగన్నాథం అక్కడ కనబడ్డారామెకు.

"ఒరేయ్—జగన్నాథం! బాగు చేసుకున్నా, పాడు చేసుకున్నా—మా పిల్లల విషయంలో బాధ్యత మాదేనని చెప్పానుగా. నువ్వు త్వరగా వెళ్ళి వాడెక్కడికి వెడుతున్నాడో, ఏం చేస్తున్నాడో చూసి వచ్చి నాకు చెప్పు....—" అన్నాడు నారాయణరావు.

జగన్నాథం వెంటనే వెళ్ళిపోయాడు.

నారాయణరావు కోడలి వంక తీవ్రంగా చూసి—
"సతీష్ ఎలా పాడయ్యాడో నాకు తెలుస్తోందిప్పుడు-" అన్నాడు.

"నన్ను క్షమించండి మామయ్యా!" అంది మాలతి.

"నిన్ను నేను క్షమించగలను కానీ సతీష్‌ను బాగు చేయలేను—" అన్నాడు నారాయణరావదోలాగున.

"వాడు కాళ్ళు పట్టుకుని యేడ్చేసరికి కాదనలేక పోయాను—...."

"పిల్లల్ని అదుపు చేయడానికి మనోబలముండాలి. వాళ్ళనదుపు చేయడం వాళ్ళ క్షేమానికే!" అన్నాడు నారాయణరావు.

"ఇప్పుడేమవుతుంది?" అంది మాలతి.

"నువ్వు చేసిన పొరపాటు నీ కొడుకు నేదశకు తీసుకుని వెళ్ళిందో తెలుసుకునేందుకు — నీ భర్త తిరిగి రావాలి—" అన్నాడు నారాయణరావు.

ఆ తర్వాత మాలతి నిద్రపోలేదు. ఏ శక్తి సతీష్‌ను బలవత్తరంగా ఆకర్షిస్తోందో తెలుసుకోవాలని ఇద్దరూ యెదురుచూస్తున్నారు.

కాసేపటికి జగన్నాథం వచ్చాడు. అతడి ముఖంలో పుట్టెడు దిగులు. తండ్రి భార్య యెంతగా అడిగినా జవాబు చెప్పడానికతడికి గొంతు పెగలడానికి కాసేపు పట్టింది.

ఏమైతేనేం అసలు విషయం అందరికీ తెలిసింది.

సతీష్ మత్తుపదార్థాల కలవాటుపడ్డాడు.

"మత్తుపదార్థాలంటే?" అంది మాలతి.

"అవి రకరకాలు. బాధల్ని మరిచిపోవడానికీ, అసంతృప్తిని జయించడానికీ మనిషి వాటిని ఆశ్రయి

స్తాడు. అప్పు డతడికి తన పై తనకే అదుపుండదు. మత్తు పదార్థాలకు బానిస అయిన వ్యక్తి శారీరకంగా, మానసికంగా కృశించి దౌర్భాగ్యపు చావు చస్తాడు. అదీ చిన్న వయసులో!" అన్నాడు నారాయణరావు.

మాలతి వణికిపోయింది.

నారాయణరావు కొడుకు వంక తిరిగి— "నువ్వు వాడిని వెంట తీసుకునిరాలేదేం?" అన్నాడు.

"వాడెక్కడికి వెళ్లాడో చూశాను. ఏంచేస్తున్నాడో తెలుసుకున్నాను. నాకా వాతావరణంలో అడుగు పెట్టాలంటే భయం వేసింది నాన్నా! ఎలాగో అలా నువ్వే మన సతీష్‌ని రక్షించాలి—" అన్నాడు జగన్నాథం.

నారాయణరావు నిట్టూర్చి- "వాడింత గోల పెట్టి అక్కడికి పోయాడంటే వాడి పదార్థాలకు బాగా అలవాటు పడ్డాడన్న మాట. మన నిర్లక్ష్యం వల్లనే వాడీదశకు వచ్చాడు. వాడి గురించి మనకు తెలిసినట్లు వాడికి తెలియనివ్వద్దు వాణ్ని మంచిదారిలో పెట్టే ఉపాయం నేనాలోచిస్తా యి-" అన్నాడు.

"నువ్వాలోచిస్తే అన్నీ సానుకూలమవుతాయి. నాకా నమ్మకముంది నాన్నా!" అన్నాడు జగన్నాథం.

ఆ రాత్రికి ఆ యింట్లో ఎవ్వరికీ సరిగా నిద్రపట్టలేదు. తెల్లవారుఝామున సతీష్ వస్తే ఆ విషయం కూడా ఎవ్వరూ పట్టించుకోలేదు.

10

మర్నాడుదయం సతీష్ బాగా ఆలస్యంగా నిద్ర లేచాడు. ఎవ్వరూ అతణ్ని పెందరాళే నిద్ర లేపడానికి ప్రయత్నించలేదు.

సతీష్ నిద్రలేచి కాలకృత్యాలు తీర్చుకునేసరికి జగన్నాథం ఆఫీసుకు వెళ్ళిపోయాడు. నారాయణరావు మనుమణ్ని పిలిచి—"ఒరేయ్-కొన్నాళ్ళుగా నేను ఒంటరితనం ఫీలవుతున్నాను. కొంతకాలం పాటు మనమిద్దరం కలిసి తిరుగుదాం. నువ్వెక్కడికి వెడితే నేనూ అక్కడికి వస్తాను-" అన్నాడు.

"ఒక్క రాత్రిళ్ళు తప్ప...." అన్నాడు సతీష్.

"ఎందుకని?"

సతీష్ వెంటనే ఏమీ బదులివ్వలేదు. ఒక్కక్షణం ఆగి—"తాతయ్యా! సుధాకర్‌కి నేను తన బామ్మను చంపానని అనుమానంగా ఉంది. తనూ నిన్ను చంపి ప్రతీకారం తీర్చుకుంటానంటున్నాడు. రాత్రిళ్ళు నువ్వు బయట తిరగడం మంచిదికాదు—" అన్నాడతడు.

"నువ్వు సుధాకర్ బామ్మను చంపితే మధ్య నేనేం చేశాను?"

"చావు విషయంలో నువ్వేదో నాటకమాడావని అతడి అనుమానం. అదైన నాకు నువ్వంటే యిష్టమని తెలుసుగా.... నీ కోసం నేను జీవితాంతం కుమిలి ఏడ్చేలా చేస్తానంటున్నాడు...." అన్నాడు సతీష్.

"అయితే మాత్రం-నాకేం భయంరా ... నేనెక్కడికి వెళ్ళినా నువ్వు నా పక్కనుంటావు. నీ తాతయ్యను నువ్వు రక్షించుకోలేవూ?" అన్నాడు నారాయణరావు.

సతీష్ అప్రయత్నంగా గదిలోని పూజామందిరంవైపు చూశాడు. పైన గోడకు వ్రేలాడుతున్న పటంలోని ఆంజనేయుడు తనవైపు కుతూహలంగా చూస్తున్నాడు.

"చెప్పరా — నీ తాతయ్యను నువ్వు రక్షించుకోలేవూ?"

"నా మాట విను తాతయ్యా—రాత్రిళ్ళు నువ్వు బయటకు రావొద్దు."

నారాయణరావు చిరాగ్గా — "నువ్వేవో దాస్తున్నావు. ఆంజనేయుడు సాక్షిగా నిజం చెప్పాలి నువ్వు"- అన్నాడు.

సతీష్ చటుక్కున - "ఆ పటానికి ఫ్రేం పాడయింది తాతయ్యా! నేను కొత్త ఫ్రేం వేయిస్తాను...." అన్నాడు.

అతడు మాట మార్చుతున్నాడని నారాయణరావు గ్రహించాడు. తనూ నొక్కించకూడదనుకుని—"ఫ్రేం మార్చినా ఆంజనేయుడు మారడు—" అన్నాడాయన.

"నాకు తెలుసు. ఏదో నా తృప్తికోసం-" అన్నాడు సతీష్.

నారాయణరా వంగీకరించగానే అతడు పటం తీసుకుని బయటకు వెళ్ళి కాసేపట్లోనే తిరిగివచ్చి - "తాతయ్యా! చాలా పెద్దఘోరం జరిగిపోయింది-" అన్నాడు.

"ఏమయిందిరా?" అన్నాడు నారాయణరావు.

"పటం దారిలో చేయిజారి పగిలిపోయింది. బొమ్మ తీసుకుందామనుకుంటూండగా ఓ పిచ్చివాడు పరుగునవచ్చి నా దగ్గర్నుంచి అది లాక్కుని ముక్కలు ముక్కలుగా చించేశాడు—" అన్నాడు సతీష్.

నారాయణరా వా కథ నమ్మలేదు. సతీషంతరాత్మ నా పటం బాధిస్తోంది. అందుకని కావాలనే అతడా పటాన్ని నాశనం చేశాడని ఆయన నమ్మాడు.

"సతీష్ విషయంలో ఏదో ఒకటి చెయ్యాలి. వాడి పరిస్థితి ప్రమాదకరంగా తయారవుతోంది—" అనుకున్నాడాయన.

11

ఆ రోజు మధ్యాహ్నం బయటకు వెళ్ళిన సతీష్ రాత్రి పదైనా ఇంటికి రాలేదు. మాలతి బెంగపడుతూంటే—

“నిన్న వాణ్ణి అదుపు చేయాలని చూశాంగదా—అందుకని మధ్యాహ్నమే ఇల్లు వదిలి పెట్టాడు—” అన్నాడు నారాయణరావు

ఆయన జగన్నాథాన్నడిగి సతీష్ వెళుతున్న ఇంటి వివరాలు తెలుసుకున్నాడు. అప్పటికప్పుడే తనే ఆ ఇంటికి బయల్దేరాడు.

అదొక చిన్న బంగళా. బంగళా ముందు వరండాలో పడక కుర్చీలో ఓ నడివయస్కుడు కూర్చుని ఉన్నాడు. ఆయన నారాయణరావును చూసి—“ఎవరు మీరు? మీ రెవరి కోసం వచ్చారు?’ అన్నాడు.

“నా మనుమడి పేరు సతీష్....అతడికోసం వచ్చాను..”

“అతడిక్కడుంటాడని మీ కెవరు చెప్పారు?”

“నాకు నీ గురించి అంతా తెలుసు. యువకులను మత్తు పదార్థాల కలవాటు చేయడం నీ వృత్తి. నీ విషయం పోలీసులకు రిపోర్టిస్తాను. నీ అంతం చూస్తాను-”అన్నాడు నారాయణ రావావేశంగా.

అతడు నవ్వి—“నా గురించి బాగానే తెలుసుకున్నావు. తెలుసుకున్నాక నువ్వు మిగలవు-” అన్నాడు.

“నన్ను బెదిరించకు. నాకు భయంలేదు....” అన్నాడు నారాయణరావు.

“అయితే లోపలకు వెళ్ళు. నీ సతీషున్నాడేమో చూసుకో”—అన్నాడా వ్యక్తి.

నారాయణరావు లోపలకు వెళ్ళాడు. ఓ చిన్నగది.... ఆ గదినానుకుని ఓ విశాలమైన హాలు. హాల్లో పదిహేను

గురు యువకులున్నారు. వాళ్ళలో ఆయనకు సుధాకర్, విశ్వంలు కనబడ్డారు. సతీష్ లేడు.

వాళ్ళందరూ అలౌకికానందంలో ఉన్నారు. కొందరు పైపు పీలుస్తున్నారు. కొందరు సిగరెట్ కాలుస్తున్నారు.

సుధాకర్ నారాయణరావును చూసి—"మీరు సతీష్ కోసం వచ్చారా? ఆ వంక పెట్టుకుని వచ్చారా?" అన్నాడు.

అతడీలోకంలో లేడని నారాయణరావు కర్థమయింది. సరిగ్గా అప్పుడే బయటివ్యక్తి లోపలకు వచ్చి— "నా ప్రియ స్నేహితులారా! ఇతడు నన్ను పోలీసులకు పట్టిస్తానని బెదరిస్తున్నాడు. నేను పోలీసులకు దొరికితే మీకీ ఆనందముండదు. కాబట్టి మీరితడికి తగిన విధంగా బుద్ధి చెప్పండి...." అన్నాడు.

ఆ వ్యక్తి మాటలు పూర్తయ్యేలోగా నలుగురు యువకులు నారాయణరావు మీద పడ్డారు. వాళ్ళు తలో దెబ్బ వేస్తూంటే నారాయణరావు క్రిందపడిపోయాడు. లేవబోతూండగా గుమ్మం దగ్గర ఆయనకు సతీష్ కనిపించాడు.

"ఒరేయ్ సతీష్....సమయానికి వచ్చావు. నన్ను రక్షించరా?" అని అరిచాడాయన.

సతీషాయన వంకే చూస్తూ ముందడుగు వేశాడు.

12

"అమ్మకు, నాన్నకు సతీష్ నమస్కరించి వ్రాయునది.

దీపను ప్రేమించిన భ్రమలో నేను మత్తుపదార్థాల కలవాటు పడ్డాను. ఆ అలవాటుకు డబ్బుకావాలి. అందుకని చిల్లర నేరాలు ప్రారంభించాను. డబ్బు దొంగి

లించడానికి వృద్ధులను, అసహాయులను, వికలాంగులను ఎన్నుకునేవాణ్ని. ప్రతిఘటించిన కారణంగా చాకుతో పొడిస్తే సుధాకర్ బొమ్మ చనిపోయింది. ఆ హత్య నేనే చేశాను.

నేను మత్తు పదార్థాలకి బానిసని. వాటి కోసం ఏమైనా చేస్తాను. నావంటి యువకులు చాలామంది ఉన్నారు. మా వంటి వారివల్ల ప్రమాదముండకూడదనుకుని- తాతయ్యను రాత్రిళ్ళు బయట తిరగవద్దని హెచ్చరించాను. ఆయన నా మాట వినకుండా సరాసరి రాకూడని చోటుకే వచ్చాడు.

తాతయ్య నన్ను హత్యకేసులోంచి రక్షించాడు. ఎక్కడున్నా నేను తనని రక్షించగలనని నమ్మాడు. కానీ మత్తు పదార్థాల అదుపులో ఉన్న నేను—వాటికోసం ఏమైనా చేయగల నేను—ఆ సమయంలో— నన్ను రక్షించు సతీష్.... అంటున్న తాతయ్యను.... నేనే స్వయంగా చాకుతో పొడిచి చంపాను. ఏ చాకుతో అయితే తాతయ్య నన్ను రక్షించాడో—ఆ చాకుతో నే ఆయన్ను పొడిచి చంపాను.

తెల్లవారేక గానీ నా తప్పు నాకు తెలియలేదు. అప్పుడు నా తప్పు నాకు తెలిసీ ప్రయోజనం లేదు.

తాతయ్య నా గురించి ఆత్మార్పణ చేశాడు. ఆయన ఆత్మార్పణ నాకు సహకరించదు. ఇప్పటికే నేను హంతకుణ్ని.

అయితే తాతయ్య ఆత్మార్పణ వృథాపోకూడదు.

అందుకే నన్నిలా తయారుచేసిన వారి గురించిన పూర్తి వివరాలు పోలీసు స్టేషన్‌కు ఉత్తరం ద్వారా అందజేస్తు

న్నాను.

అసలేం జరిగిందో తెలుసుకుందుకు మీకీ ఉత్తరం రాస్తున్నాను.

ఇది మీకందే సమయానికి నేనీలోకంలో ఉండను.

అదుపు తప్పిన యువకులకు నా కథ అదుపు కావాలన్నది నా కోరిక. త్వరగా తాతయ్యను కలుసుకుని ఆయన కేకాంత బాధ లేకుండా చేయాలన్నది నా ఆకాంక్ష. తాతయ్యంటే నా కెంత ఇష్టమో మీకూ తెలుసు...."

ఉత్తరం మడిచి జగన్నాథం ఏడుస్తూ—"నాన్నా! నా కొడుకును నేనదుపు చేయలేక పోయాను. నీ ప్రాణ త్యాగంతో దేశంలోని ఎందరో యువకుల నదుపు చేస్తున్నావు నువ్వు—" అన్నాడు.

పూజామందిరం పైన గోడకు వ్రేలాడుతున్న ఫొటోలో ఆంజనేయుడి స్థానంలో వున్న నారాయణరావు ముఖంలో చెరగని చిరునవ్వు—కొడుకుతో—"నీ దుఃఖాన్ని అదుపు చేసుకో." అని హెచ్చరిస్తోంది.

—: అయిపోయింది :—